సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 11 । మే । 2024



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 778 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



జగన్‌తోనే వక్కలిగల అభ్యున్నతి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే వక్కలిగల అభ్యున్నతి సాధ్యమని వక్తలు అన్నారు. శుక్రవారం మడకశిరలో మక్కలిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. VIIIలో

గరిష్టం/కనిష్టం
39.5°/23.2°

జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

'ఫ్యాన్' ఫుల్ స్పీడ్



బుక్కపట్నంలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన జనం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి శాంతమ్మ





ఈరలక్కప్ప ప్రచారం సందర్భంగా అగళి మండలం ఆలూడిలో జగన్ పాటకు నృత్యం చేస్తున్న యువతులు



హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక చిలమత్తూరులో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

ఫ్యాన్ ఫుల్ స్పీడ్‌తో తిరుగుతోంది. ఊరూవాడా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతోంది. ప్రచారంలో భాగంగా నాయకులు ఎక్కడికి వెళ్లినా జనం నీరాజనాలు పలుకుతున్నారు. హారతులు పట్టి అభిమానం చాటుతున్నారు. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు 'మేమంతా సిద్ధం' అంటూ నినదిస్తున్నారు.

- ఊరూవాడా చుట్టేసిన వైఎస్సార్‌సీపీ నేతలు
- జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన
- 'మేమంతా సిద్ధం' అంటోన్న అభిమానులు
- టీడీపీ అభ్యర్థులకు ప్రచారంలోనే పరాభవం
- కలిసి రాని మిత్రపక్షాల కార్యకర్తలు, నాయకులు
- నేటితో ప్రచార పర్వం పరిసమాప్తం

సాక్షి, పుట్టపర్తి

ఎన్నికల్లో ఫ్యాన్ గాలి సునామీని సృష్టించేలా కనిపిస్తోంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు,



అగళి మండలం ఆలూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలే స్టార్ క్యాంపెయిన్లుగా జగన్ తరఫున ప్రచారం హోరెత్తిస్తున్నారు. శనివారం సాయంత్రం ప్రచారపర్వం ముగియనుండగా, వైఎస్సార్ సీపీ నాయకులు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.

మేమంతా సిద్ధం..

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ బలం అంచెలంచెలుగా పుంజుకుంది. నామినేషన్ల దాఖలు సమయంలోనే టీడీపీ, బీజేపీ కంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పైచేయి సాధించారు. భారీ జనసందోహం మధ్య నామినేషన్ పత్రాలు సమర్పించారు. మరోవైపు జనాలు లేక.. పిలిచినా రాక.. అసమ్మతి నేతలు కలవక.. కూటమి అభ్యర్థులు ఉన్నవారితోనే కలిసి తూతూ మంత్రంగా వెళ్లి రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు ఇచ్చారు. ఇక ప్రచారంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎక్కడా తగ్గలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు



రామగిరి మండలం నసనకోట సభలో పాల్గొన్న జనం

వివరిస్తూ ముందుకుసాగారు. ప్రతి నియోజకవర్గంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు సాదర స్వాగతం పలికారు. జగన్ కోసం 'మేమంతా సిద్ధం' అంటూ ప్రజలే స్టార్ క్యాంపెయినర్లుగా మారి ప్రచారం హోరెత్తించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు.

జగన్ రాకతో పెరిగిన 'ఫ్యాన్' స్పీడు..

రెండు నెలల వ్యవధిలోనే సీఎం వైఎస్ జగన్ హిందూపురం పార్లమెంటుకు మూడుసార్లు వచ్చారు. ఫిబ్రవరి 18న రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభలో పాల్గొన్నారు. ఏప్రిల్ 1వ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్

తేదీన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా



చిలమత్తూరు మండలం పాలేపల్లిలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

ఈనెల 4వ తేదీన హిందూపురం వచ్చి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సీఎం సభలకు జనం పోటెత్తగా, పార్లమెంటు వ్యాప్తంగా 'ఫ్యాన్' స్పీడు పెరిగింది. ఈ సారి 2019 ఎన్నికల ఫలితాలను మించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మెజారిటీ వస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

'తమ్ముళ్ల' తీరుపై జనం బేజారు..

బీజేపీ, జనసేన పొత్తుతో టీడీపీ పరిస్థితి అగమ్యగోచరమైంది. ఒక్క సీటూ ఇవ్వలేదని జనసేన కార్యకర్తలు కలిసి నడవడంలేదు. బీజేపీ కార్యకర్తలతో కలిసి నడుద్దామంటే మైనార్టీల ఓట్లన్నీ దూరమవుతున్నాయి. దీంతో ఈసారి ఘోర పరాజయం తప్పదని తెలుసుకున్న 'తమ్ముళ్లు' దాడులకు తెగబడుతున్నారు. వివిధ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా దౌర్జన్యాలకు దిగుతున్నారు. ధర్మవరంలో బీజేపీ నేతలు ప్రత్యర్థి పార్టీల నేతలకు డబ్బులు ఎరగా వేసే ప్రయత్నం చేస్తున్నారు. కదిరిలో జనాలకు పంచేందుకు డబ్బులు తెస్తూ కందికుంట వెంకట ప్రసాద్‌కు చెందిన వాహనం అనంతపురంలో పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. టీడీపీ నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

హోరెత్తిన ప్రచారం

శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారం హోరెత్తించారు. బుక్కపట్నంలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ రోడ్‌షో నిర్వహించగా, జనం భారీగా హాజరయ్యారు. రామగిరి మండలం మాదాపురం, నసనకోట గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బహిరంగ సభ నిర్వహించగా, ఇసుకేస్తే రాలనంత జనం హాజరయ్యారు. అలాగే చిలమత్తూరు మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక వర్షంలోనూ ప్రచారం నిర్వహించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అగళి మండలం ఆలూడి గ్రామంలో మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రచారానికి విశేష స్పందన లభించింది. యువతులు నృత్యాలతో సందడి చేశారు.

న్యూస్‌రీల్


పోలింగ్ కేంద్రాల పరిశీలన



స్థానిక ఉర్దూ పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

గోరంట్ల: ఎన్నికల పరిశీలకులు దీపక్ రామచంద్ర తివారీ శుక్రవారం మండలంలోని గుమ్మయ్యగారిపల్లి, మల్లాపల్లి, గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పన, బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలకు క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అక్బల్‌బాషా, ఆర్‌ఐ సోమశేఖరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు కలగకూడదు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎన్‌పీకుంట: ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ రామచంద్ర తివారి, పోలీసు పరిశీలకులు ఇమ్నాలెన్సా అధికారులకు సూచించారు. శుక్రవారం వారు మండలంలోని తిమ్మమ్మమర్రిమాను పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. పోలింగ్ రోజున నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి ఆరా తీశారు. అక్కడ తీసుకోనున్న చర్యలను స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక శక్తులపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. వారి వెంట కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్‌ఐ శ్రీధర్ ఉన్నారు.

ఐదేళ్లలో అద్భుత ప్రగతి సాధించాం

- 94 శాతం మంది పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించాం
- నిరంతరం ప్రజల్లోనే ఉంటూ సేవ చేశా
- ఈసారి మనకొచ్చే మెజార్టీ చూసి ప్రత్యర్థులకు వణుకు పుట్టాలి
- బహిరంగ సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి
- హాజరైన వేలాది మంది ప్రజలు, చేనేత ప్రముఖులు, కార్మికులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: "గత ఐదేళ్లలో నియోజకవర్గంలోని 94 శాతం మంది పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించాను. నవరత్నాల పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే రూ.3,200 కోట్లు జమ చేశాం. రూ.5,200 కోట్ల నిధులతో పనులు చేపట్టి అభివృద్ధిలో ధర్మవరాన్ని అగ్రస్థానంలో నిలిపాం. ఈ ఎన్నికల్లో కేతిరెడ్డికి వచ్చే మెజార్టీ చూసి ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టాలి. ధర్మవరంలో పోటీ చేయాలంటే భయపడే విధంగా తీర్పు ఇవ్వాలి" అని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. వేలాది మంది ప్రజలు, పట్టణ చేనేత ప్రముఖులు, చేనేత కార్మికులు పాల్గొన్న సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, ధర్మవరం అభివృద్ధికి చిరునామాగా మారిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం, రైతుల వద్దకే సేవలందించే విధంగా రైతు భరోసా కేంద్రాలు, చేనేత కార్మికులకు 'నేతన్న నేస్తం' పథకం ద్వారా ఏటా రూ.24 వేలు ఒక్కో కుటుంబానికి అందించారన్నారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించామన్నారు. అలాగే అమ్మ ఒడి, జగనన్న విద్యా, వసతి దీవెన పథకాల ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యను అందించారన్నారు. అందువల్లే తనవల్ల మేలు జరిగితేనే ఓటు వేయాలని అడిగిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని అన్నారు.

పేదల ద్రోహి చంద్రబాబు..

పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించడం కోసం జగనన్న బటన్‌లు నొక్కితే.. వాటిని అందకుండా ఎన్నికల కమిషన్ ద్వారా అడ్డుకుంటున్న దుర్మార్గుడు చంద్రబాబు అని కేతిరెడ్డి ధ్వజమెత్తారు. వృద్ధులకు పింఛన్లు ఇంటివద్దకే వచ్చి వలంటీర్లు అందిస్తుంటే అది కూడా ఓర్వలేక అడ్డుకున్నారన్నారు. ఇంతటి దుర్మార్గపు ప్రతిపక్ష ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టకరమన్నారు.

చేనేతల అభ్యున్నతి కృషి..

తన రాజకీయ జీవితంలో వెన్నంటే ఉండి మద్దతు తెలుపుతున్న చేనేతల అభ్యున్నతికోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు సాయం అందించేందుకు జోలెపట్టి యాచించి సాయం అందించాని, అధికారంలోకి వచ్చాక టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకూ రూ.5 లక్షలు సాయం అందించానన్నారు. గతంలో రూ.600 ఉన్న ముడిపట్టు రాయితీని రూ.2 వేలకు పెరిగేలా చూశానన్నారు. అదీ ఒకేసారి అందించే విధంగా 'నేతన్న నేస్తం' పథకాన్ని సీఎం జగన్ సహకారంతో తీసుకువచ్చామన్నారు. దీంతో ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షల సాయం అదించగలిగామన్నార. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు చేనేతలకు అందిస్తానన్నారు.

నాన్‌లోకల్ నాయకున్ని తరిమికొట్టాలి..

నిరంతరం ప్రజలతో మమేకమై ఉండే కేతిరెడ్డిని ఢీకొట్టేందుకు వరదాపురం సూరి, పరిటాల శ్రీరాంలు సరిపోరని.. ఢిల్లీ దళారిని బీజేపీ తరఫున తనకు పోటీగా నిలిపారని కేతిరెడ్డి అన్నారు. అతడు ఇప్పటికే వందకోట్ల రూపాయలు వసూలు చేసి జేబు నింపుకుంటున్నారన్నారు. ధర్మవరం ప్రజలు అతడిని ఆదరించక పోవడంతో ఇతర రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేలు, కేంద్ర హోంమంత్రిని ప్రచారానికి దించారన్నారు. అయినా మద్దతు దొరక్క పోవడంతో సీబీఐ, ఈడీ పేరు చెప్పి ధర్మవరం వ్యాపారులను బెదిరింపులకు దిగారన్నారు. కేతిరెడ్డిని జైలుకు పంపుతానని బీజేపీ అభ్యర్థి జనం ముందు గొప్పలు చెబుతున్నారని, నన్ను జైలుకు పంపే ఖలేజా అయనకు ఉందా? అని సవాల్ విసిరారు. ఒక దళారి సత్యకుమార్ బుడ్డ బెదిరింపులకు ఇక్కడ ఎవ్వరూ భయపడరన్నారు.

విర్రవీగిన వారి పరిస్థితి ఏమిటో?

ఎన్నికల తర్వాత ఢిల్లీ లీడర్‌ను గల్లీకే పరిమితం చేస్తామన్నారు. ఎన్నికలు పూర్తి కాగానే సత్యకుమార్ పెట్టేబేడా సర్దుకుని పారిపోతారని, అప్పుడు అతడిని నమ్ముకుని ధర్మవరంలో విర్రవీగిన పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలనన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం చేనేత ప్రముఖులు కేతిరెడ్డిని గజమాలతో సత్కరించారు. సభలో చేనేత నాయకులు గడ్డం శ్రీనివాసులు, దాశెట్టి నాగరాజు, కాచర్ల అంజి, బండారు ఆదినారాయణ, దాసరి లక్ష్మీనారాయణ (డీఎల్), సిద్ది రాజేష్, నీలూరి ప్రకాష్, బీరే ఎర్రిస్వామి, బీరే కేశవ, మామిళ్ల ప్రసాద్, గడ్డం రంగ, బుడగల శంకర్, గుర్రంరాజ, కడప రంగస్వామి, కొత్త శ్రీరాములు, ఉడుముల రాము, జక్కా సింగారయ్య, నీలూరి వెంకటరాముడు, కుండా మీనాక్షయ్య, కుండా చౌడయ్య, శంకర యుగంధర్, తరుణికంటి రమేష్, కేతా లోకేష్, కాళంగి శ్రీన, శంకర తేజలతో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.



ధర్మవరంలోని పీఆర్‌టీ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనం

పోలింగ్‌కు కట్టుదిట్ట భద్రత

- ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పిస్తాం
- ఎస్పీ మాధవరెడ్డి వెల్లడి
- పోలింగ్ బూత్‌లు, చెక్‌పోస్ట్‌ల తనిఖీ



అమడగూరు: చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

అమడగూరు/నల్లమాడ/ఓడీచెరువు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పిస్తామన్నారు. ఇందుకు అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన నల్లమాడ, అమడగూరు, ఓడీచెరువు మండలాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. తొలుత ఆయన నల్లమాడ మండలం వంకరకుంట, తిప్పయ్యగారిపల్లి, ఓడీచెరువు మండలంలోని కొండకమర్ల, తంగేడుకుంట, అమడగూరు మండలంలోని జేకేపల్లి, తుమ్మల గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా పోలింగ్ బూత్ పరిధిలో పరిస్థితులను స్థానిక అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఉపేక్షించవద్దన్నారు. అలాగే సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల్లోని సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపాలన్నారు. ఆధారాలు లేకుండా డబ్బులు, బంగారు తరలిస్తుంటే వెంటనే స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా తగిన మూల్యం చెల్లించుకుంటారని సిబ్బందిని హెచ్చరించారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో ఎస్పీ ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో అనవసరంగా గొడవలు సృష్టించినా, ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాత ఘటనలు మనసులో పెట్టుకుని గొడవలకు దిగాలని చూస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్పీ వెంట సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐలు మగ్బూల్‌బాషా, వంశీకృష్ణ, రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీ హెల్పర్



బీజేపీ ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీ హెల్పర్ అరుణ (వృత్తంలో ఉన్న మహిళ)

ధర్మవరం: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీ హెల్పర్ పాల్గొనడం చర్చనీయాంశమైంది. గురువారం సాయంత్రం ధర్మవరం మండలం గరుడంపల్లిలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌తో కలసి ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీ హెల్పర్ అరుణ పాల్గొన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మికి విశేష పూజలు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. అమ్మవారిని కొలిచే గ్రామస్తులతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రెండు బైక్‌ల ఢీ - ముగ్గురికి గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తుగ్గలి మండలం రామలింగాయపల్లికి చెందిన శ్రీహరి, లోకేష్ బైక్‌లో పని మీద గుత్తికి వచ్చారు. అనంతపురం రోడ్డు వద్ద మలుపులో మరో బైక్ ఢీ కొంది. ప్రమాదంలో శ్రీహరి, లోకేష్, గుత్తిలోని మారుతి నగర్‌కు చెందిన జగదీష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రగతి అద్వితీయం.. గెలుపు సులభం!

- పుట్టపర్తిలో 'ఫ్యాన్' గాలి!
- పేదలంతా జగన్‌వైపే
- దుద్దుకుంట గెలుపు ఖాయమంటున్న విశ్లేషకులు

పుట్టపర్తి నియోజకవర్గం



నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు ఇలా...			
మండలం	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
కొత్తచెరువు	16,197	16,588	32,787
బుక్కపట్నం	16,123	16,343	32,466
పుట్టపర్తి రూరల్	11,163	11,189	22,352
పుట్టపర్తి అర్బన్	12,940	13,611	26,558
నల్లమాడ	16,854	16,878	33,733
ఓడీచెరువు	19,219	19,520	38,740
అమడగూరు	11,596	11,841	23,440



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

పుట్టపర్తి: సార్వత్రిక ఎన్నికల్లో పుట్టపర్తి నియోజవకర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం దిశగా దూసుకుపోతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ విజయానికి పునాదులుగా మారాయంటున్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్ నేరుగా రూ.వందల కోట్లు జమ చేశారు. ఇదే సమయంలో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పూర్తి సహకారం అందజేశారు. రూ.వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో శరవేగంగా పూర్తయ్యాయి. మరికొన్ని పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ప్రజలంతా మూకుమ్మడిగా మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధమైనట్లుగా తెలుస్తోంది.

అన్ని మండలాల్లోనూ జోరు..

పుట్టపర్తి నియోజకవర్గంలో రెండో సారి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గెలుపు దాదాపు ఖాయమని తెలుస్తోంది. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి కుటుంబానికీ ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. దీంతో అన్ని మండలాల్లోనూ వైఎస్సార్‌సీపీ పూర్తి స్థాయిలో బలపడింది. జిల్లా కేంద్రంగా పుట్టపర్తి ఏర్పాటు వెనుక ఎమ్మెల్యే దుద్దుకుంట చేసిన కృషిని ఈ సందర్భంగా ప్రజలు గుర్తుకు చేసుకుంటున్నారు. అలాగే 193 చెరువులను నీటి నింపే ప్రయత్నం, జాతీయ రహదారుల నిర్మాణం, 30 వేల మంది మహిళలకు ఇంటి పట్టాలతో పాటు పక్కా గృహ నిర్మాణాలు మంజూరు చేయడం తదితరాలు శ్రీధర్‌రెడ్డి విజయానికి సోపానాలుగా మారాయని విశ్లేషకులు అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో పుట్టపర్తి నియోజకవర్గం ఏర్పడింది. 2009–19 వరకూ టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన పల్లె రఘునాథరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మంత్రి పదవి పొందినప్పటికీ ఆయన పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి ఏ మాత్రం కృషి చేయలేదు. దీంతో ఈ ఎన్నికల్లో పల్లె ఓటమి ఖాయమని నిర్ధారించుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు... ఈ సారి బరిలోకి ఆయన కోడలు పల్లె సింధూరరెడ్డిని దింపారు. అయినా తెర వెనుక మొత్తం పల్లె రఘునాథరెడ్డినే ఉంటూ రాజకీయం నడుపుతుండడంతో ఆ పార్టీ పట్ల సర్వత్రా విముఖతవ్యక్తమవుతోంది.

అభివృద్ధి పనుల్లో కొన్ని...

- ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం వయా పుట్టపర్తి, గోరంట్ల మీదుగా కోడూరు తోపు వరకు 342 జాతీయ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1,640 కోట్లు వెచ్చిస్తోంది.
- ముద్దనూరు నుంచి పులివెందుల, కదిరి, ఓడీచెరువు మీదుగా మరో జాతీయ రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి.
- కర్ణాటకలోని బాగేపల్లి నుంచి మేదరమెట్ల వరకు ఆరు లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరైంది. ఈ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి.
- రూ.864 కోట్లతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే పనులు వేగంగా జరుగుతున్నాయి.
- జిల్లాలోని ఆరు మండలాల్లో రూ.200 కోట్లతో సిమెంట్, తారురోడ్డు పనులు పూర్తి చేశారు.
- ఓడీ చెరువు వద్ద రూ.30 లక్షలతో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైంది.

ప్రభావితం చూపే అంశాలివే...

నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గానికి ఓట్లు 35 వేలు ఉండగా వీటిలో దాదాపు 90 శాతం ఓటర్లు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. బోయ, వడ్డె, కురుబ, తదితర బీసీ సామాజిక వర్గానికి చెందిన లక్షకు పైగా ఓటర్లు ఉన్నారు. ఈ సారి ఎన్నికల్లో పల్లె రఘునాథరెడ్డి కాకుండా బీసీ సామాజిక వర్గానికి టికెట్ కేటాయిస్తామంటూ గతంలో చంద్రబాబు ప్రకటించారు. అయితే చివరి నిమిషంలో బీసీలను వంచిస్తూ పల్లె రఘునాథరెడ్డి కోడలికి టికెట్ కేటాయించారు. దీంతో బీసీల్లో అసంతృప్తి పెరిగిపోయింది. 70 శాతానికి పైగా బీసీలు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ముస్లింలో 80 శాతం మంది ఓటర్లు ఇప్పటికే తమ మద్దతు వైఎస్సార్‌సీపీకేనని బాహాటంగా ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ కేంద్రంలోని ప్రభుత్వ పెద్దలు ప్రకటించిన అంశాన్ని ఆ సామాజిక వర్గం తీవ్రంగా పరిగణిస్తోంది. దీంతో బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీకి ఎలాంటి పరిస్థితుల్లోనూ తాము మద్దతు ఇవ్వలేమంటూ ముస్లింలు ప్రకటించారు. ఈ నేపథ్యంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విజయం నల్లేరు మీద నడకేనని విశ్లేషకులు అంటున్నారు.

కష్టకాలంలో ఆదుకున్న దుద్దుకుంట

నియోజకవర్గ ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మానవీయతను చాటుకున్నారు. 2014 నుంచి 2019 వరకూ ఆయన ప్రతిపక్షంలో ఉన్నారు. తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న ఆ రోజుల్లో దుద్దుకుంట ఫౌండేషన్ ద్వారా ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికి నీటిని అందజేశారు. ఫోన్ చేసిన గంటల వ్యవధిలోనే ఆయా గ్రామాలకు ట్యాంకర్లను చేర్చి ప్రజల దాహార్తి తీర్చారు. వైఎస్సార్ పేరుతో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి దాదాపు 50 వేల మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా మహమ్మారి కబంధ హస్తాల్లో నియోజకవర్గం విలవిల్లాడింది. ఆ సమయంలో టీడీపీ నాయకులు ఏ ఒక్కరూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదు. పనుల్లేక ప్రజలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఇలాంటి తరుణంలో నియోజకవర్గ ప్రజలకు నేనున్నానంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముందుకు వచ్చారు. 10 వేల టన్నుల కూరగాయలు, నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్లు, మందులు అందజేసి ప్రజల ఆకలి బాధలు తీర్చారు. వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా 55 వేల మందికి శస్త్రచికిత్సలు చేయించారు.

పుట్టపర్తిలో చెలరేగిన టీడీపీ గూండాలు

- బెదిరింపులతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రచారాన్ని అడ్డుకున్న వైనం

పుట్టపర్తి రూరల్: జిల్లా కేంద్రంలో టీడీపీ అల్లరిమూక చెలరేగింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై బెదిరింపులకు దిగి ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుంది. వివరాలు... పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని చిత్రావతిగుట్ట 7, 8 వార్డుల పరిధిలో శుక్రవారం ఉదయం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆ సమయంలో అక్కడకు చేరుకుని టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోవాలని, లేకుంటే మహిళలని కూడా చూడకుండా దాడులు చేస్తామంటూ బెదిరించారు. నచ్చచెప్పేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దూకుడు ప్రదర్శించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఓటు అడిగే హక్కు ఉందని, తాము ప్రచారం చేస్తామని, అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించడంతో టీడీపీ గూండాలు అక్కడి నుంచి వైదొలిగారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పట్టణ సీఐ కొండారెడ్డి ఘటనపై ఎమ్మెల్యేతో ఆరా తీశారు. స్థానికులనూ అడిగి తెలుసుకున్నారు. చిత్రావతి గుట్టపై రామ్‌లక్ష్మణ్ సోదరుల అగడాలు పెరిగిపోయాయని, వారి ప్రోద్బలంతోనే కొందరు టీడీపీ గుండాలు బెదిరింపులకు దిగుతున్నారంటూ పలువురు పేర్కొన్నారు. రాత్రి సమయాల్లో ఫోన్లు చేసి టీడీపీకి అనుకూలంగా ఓటు వేయకపోతే దాడులు చేస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. ఓటమి భయంతోనే టీడీపీ కవ్వింపు చర్యలకు దిగుతోందని, ఇలాంటి బెదిరింపులకు ఎవరూ భయపడకూడదని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ప్రశాంతంగా ఉన్న పుట్టపర్తిలో అలజడులు సృష్టించి లబ్ధి పొందాలనుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. అనంతరం ప్రజల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేలా చిత్రావతి గుట్టకు కేంద్ర బలగాలను సీఐ కొండారెడ్డి రప్పించి కవాతు చేపట్టారు.



టీడీపీ బెదిరింపులపై ఆరా తీస్తున్న పోలీసులు, చిత్రంలో ఎమ్మెల్యే దుద్దుకుంట

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడు ఈరలింగప్ప

అమరాపురం: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... మండల కేంద్రం అమరాపురానికి చెందిన రైతు ఈరలింగప్ప (63)కు భార్య ఈరమ్మ, కుమారుడు యంజేరప్ప ఉన్నారు. వ్యవసాయ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శుక్రవారం ఉదయం వి.అగ్రహారం రోడ్డులో ఉన్న తన తోటకు ఈరలింగప్ప వెళ్లాడు. ఆ సమయంలో బోరుబావి మోటారుకు అనుసంధానం చేసిన స్టార్టర్ పెట్టెలో నుంచి మంటలు ఎగిసి పడుతుండడంతో విద్యుత్ సరఫరాను ఆపేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లాడు. అప్పటికే పింగాణీ ఫ్యూజ్ కేరీర్ నుంచి బయటకు వచ్చిన తీగ స్తంబానికి తగులుకుని విద్యుత్ ప్రసారమవుతున్న విషయాన్ని గమనించని ఆయన నేరుగా వెళ్లి దానిని తాకాడు. దీంతో షాక్‌కు గురై స్తంభానికి అనుకుని కుప్పకూలి మృతి చెందాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో శరీరం సగం కాలిపోయింది. సమీపంలో ఉన్న రైతులు గుర్తించి వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని ఈరలింగప్ప మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.

నైటింగేల్ స్ఫూర్తితో సేవలందించాలి



స్ట్రెచర్, వీల్‌చైర్ తదితర వైద్య వైద్య సామగ్రి అందజేసిన స్టాఫ్‌నర్సులు

అనంతపురం కార్పొరేషన్: ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ప్రభుత్వ సర్వజననాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు స్టాఫ్‌నర్సులకు సూచించారు. శుక్రవారం ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు స్టాఫ్‌నర్సులు సర్వజనాస్పత్రికి స్ట్రెచ్చర్లు, వీల్‌చైర్లు, స్టూళ్లను పంపిణీ చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, హెడ్‌నర్సులు మంగమ్మ, రోస్‌కిరణ్ , భానులత, ఎస్ విజయ, నాగమణి, స్టాఫ్‌నర్సులు బి.లత, బి.అరుణ బాయి, విజయమ్మ, ఆలంబన జనార్దన్‌లు సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుకు వైద్య సామగ్రి అందజేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ స్టాఫ్‌నర్సులందించిన సేవలు మరువలేనివన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని మాట్లాడుతూ.. స్టాఫ్‌నర్సులు రోగులకు సేవలందించడంతో పాటు తమ వంతు సాయంగా రోగులకు ఉపయోపడేలా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌నర్స్ సైరాభాను, స్టాఫ్‌నర్సు అసోసియేషన్ ఆర్‌బీ పద్మ, నారాయణ స్వామి, శ్రీదేవి, ఆఫీస్ సిబ్బంది కృష్ణ, ఐసీఎస్‌లు శోభ, నీలిమ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే వక్కలిగల అభ్యున్నతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు



సమావేశానికి హాజరైన కుంచిటి వక్కలిగలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ

మడకశిర: వైఎస్ జగన్ పాలనలోనే కుంచిటి వక్కలిగలకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, బోయ శాంతమ్మ అన్నారు. మడకశిరలోని బేగార్లపల్లి క్రాస్‌లో కుంచిటి వక్కలిగల సంఘం అధ్యక్షుడు అనంతరాజు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కుంచిటి వక్కలిగల ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి పార్టీ అభ్యర్థులతో పాటు జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకుడు పోకల అశోక్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కుంచిటి వక్కలిగ అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. నియోజకవర్గానికి చెందిన వారికి చైర్ పర్సన్ పదవితో పాటు 10 మందికి డైరెక్టర్ పోస్టులూ కట్టబెట్టారన్నారు. పార్టీ పదవుల్లోనూ కుంచిటి వక్కలిగలకు అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే కుంచిటి వక్కలిగలను బీసీలుగా గుర్తించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మళ్లీ అదే స్థాయిలో కుంచిటి వక్కలిగల అభ్యున్నతికి ఆయన తనయుడు వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే మడకశిరలో కుంచిటి వక్కలిగల భవన్ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పార్టీ ఎన్నిలక పరిశీలకుడు పోకల అశోక్ కుమార్ మాట్లాడుతూ... కుంచిటి వక్కలిగల అభ్యున్నతికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కట్టుబడి ఉన్నారని, ఆయన తరపున కుంచిటి వక్కలిగ భవన్ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం అందజేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప సైతం తాము గెలిచిన తర్వాత కుంచిటి వక్కలిగ భవన నిర్మాణానికి చెరో రూ.10 లక్షల నిధులు సమకూరుస్తానని భరోసానిచ్చారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ మాట్లాడుతూ... కుంచిటి వక్కలిగ భవన్ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం ప్రకటించారు. కుంచిటి వక్కలిగల సంఘం అధ్యక్షుడు అనంతరాజు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కుంచిటి వక్కలగలందరూ వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కుంచిటి వక్కలిగ భవన నిర్మాణానికి విరాళం ప్రకటించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు, కుంచిటి వక్కలిగల సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తి



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

బొమ్మనహాళ్: మండల కేంద్రం బొమ్మనహాళ్‌లో శుక్రవారం సాయంత్రం వేంకటేశ్వర స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో అభిషేకాలు, విశేష అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. ఉదయం 10 గంటలకు రథాంగ హోమం, మడుగు రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో అధిష్ఠింపజేసి ప్రాకారోత్సవం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంపైకి చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ, గ్రామ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేలాది భక్తుల గోవింద నామ స్మరణల మధ్య రథాన్ని ఆలయ ప్రాగంణం నుంచి ప్రధాన రహదారి వరకూ లాగారు. రథోత్సవం ఎదుట వివిధ వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



రామ్మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న చరణ్‌రెడ్డి

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీపీ గీత భర్త రామ్మోహన్‌రెడ్డిని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం మక్కాజిపల్లిలో ప్రచారం చేస్తుండగా పూలహారాలు వేసే సమయంలో రామ్మోహన్‌రెడ్డి అదుపుతప్పి కింద పడ్డాడు. కాలువిరగడంతో చికిత్స అనంతరం ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. చరణ్‌రెడ్డితో పాటు నాయకులు వెంకటరత్నం, శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

చల్లాపల్లిలో 'తమ్ముళ్ల' మధ్య గొడవ

- ప్రచార వాహనం ధ్వంసం

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లిలో టీడీపీ ప్రచార వాహనం అద్దాలను ఆ పార్టీ కార్యకర్త హరీష్‌కుమార్‌రెడ్డి ధ్వంసం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. తన ఇంటి ముందు గంటల తరబడి ప్రచార వాహనం ఆపి గట్టి శబ్దాలతో పాటలు పెట్టడంతో హరీష్‌కుమార్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. డ్రైవర్ తో పాటు కార్యకర్తలు ఆయన మాట పట్టించుకోలేదు. కోపోద్రిక్తుడైన హరీష్ ఇటుకతో అద్దాలు పగలు కొట్టాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు, హరీష్ మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం టీడీపీ నాయకులు హరీష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.16 వేలు ఇస్తే కేసు లేకుండా చూస్తామని టీడీపీ నాయకులు బేరానికి దిగినట్లు చెబుతున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- డీఎస్పీ బాజీజాన్‌సైదా



మాట్లాడుతున్న డీఎస్పీ బాజీజాన్‌సైదా

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా సిబ్బందిని ఆదేశించారు. 13న ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో శుక్రవారం ఆయన సీఐ, ఎస్‌ఐలు, రూట్ ఆఫీసర్‌లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా అనుసరించాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో సీఐ యుగంధర్, సుబ్బరాయుడు, ఎస్‌ఐలు రాజేష్, వలిబాషా, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం కొత్తకోటలో టీడీపీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన 23 కుటుంబాలు శుక్రవారం టీడీపీని వీడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో ఆయన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో నాగరాజు, శివయ్య, ఎరుకలప్ప, సూరి, ఉత్తప్ప, ఎర్రిస్వామి, కిష్టయ్య, గంగాద్రి, చెన్నక్రిష్ణ, లక్ష్మీనారాయణ, చెన్నప్ప, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తకోట కేశవప్ప, బోయకృష్ణ, రెడ్డెప్పరెడ్డి, డీలర్ మధు, రఘు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి ప్రతి వారం వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులకు సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. శుక్రవారం కూడా గర్భిణులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించినట్లు సత్యసాయి సేవా సమితి మండల కన్వీనర్ అంజినరెడ్డి, ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

దప్పిక తీర్చడమే లక్ష్యంగా..




గుంతలకు నీరు నింపుతున్న దృశ్యం

పావగడ: తీవ్ర వర్షాభావం, వేసవి తాపం మనుషులకే కాదు పశు పక్ష్యాదులకు కూడా శాపంగా మారాయి. బోరు బావుల్లో జలాలు అడుగంటి పోయి తాగునీటికి మనుషులు అల్లాడి పోతుంటే మరోవైపు వన్య ప్రాణులు, పశు పక్ష్యాదులు తాగు నీరు లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక హసిరు క్రాంతి స్పోర్ట్స్ అసోసియేషన్ మూగ జీవుల దప్పిక తీర్చడమే లక్ష్యంగా ముందడుగు వేసింది. ఆ సంస్థ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జీపీ వెంకటేశ్ తదితరుల ఆధ్వర్యంలో పట్టణ పరిసర ప్రాంతాల్లోని ఎండుకు పోయిన నీటి గుంతల్లో నీటి ట్యాంకర్ల ద్వారా నీరు నింపు తున్నారు.

ప్రగతి పథంలో పుట్టపర్తి

- రూ.10 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- చిత్రావతిలో బోటింగ్ ఏర్పాటు
- రూ.2 కోట్లతో శిల్పారామం అభివృద్ధి
- పుట్టపర్తి మీదులో జాతీయ రహదారి నిర్మాణం
- రూ.5 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



బ్రాహ్మణపల్లి లేఔట్‌లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణం



చిత్రావతిలో బోటింగ్ చేస్తున్న పట్టణవాసులు

పుట్టపర్తి టౌన్/ రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుట్టపర్తి పట్టణం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో జిల్లా కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలో మునిసిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణంలో దాదాపు 36 వేల జనాభా ఉండగా 19,300 కుటుంబాలు నివసిస్తున్నాయి. దశాబ్దాల కాలంగా పాలకులు పుట్టపర్తి అభివృద్ధిని విస్మరించారు. వైఎస్సార్ హయాంలో బైపాస్ రోడ్డు, చిత్రావతి సుందరీకరణ, శిల్పారామం నిర్మాణం జరిగింది. తదనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం పుట్టపర్తి అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. పదేళ్ల ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న పల్లె రఘునాథరెడ్డి అభివృద్ధి గురించి అసలు పట్టించుకోలేదు.

రూ.1.5 కోట్ల సెంట్రల్ లైటింగ్ సిస్టం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ డిపో నుంచి సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వరకూ రూ.1.5 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో రూ.10 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. సమగ్ర తాగునీటి పథకం కింద రూ.100 కోట్లతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం చిత్రావతి నదిలో బోటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే శిల్పారామంలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.

నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

మునిసిపాలిటీ పరిధిలో 13 ప్రాథమిక, 3 జిల్లా పరిషత్ పాఠశాలలున్నాయి. ఇందులో నాడు–నేడు కింద రూ.5 కోట్లు వెచ్చించి ఆధునికంగా తీర్చిదిద్దారు. పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు, బెంచ్‌లు ఏర్పాటు చేశారు. పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పించారు. అలాగే నాడు–నేడు కింద రూ.60 లక్షలతో ఎనుములపల్లి పీహెచ్‌సీ రూపురేఖలు మార్చారు.

జోరుగా ఇళ్ల నిర్మాణం

మున్సిపాలిటీలోని ఇళ్లు లేని పేదల కోసం జగన్ ప్రభుత్వం జగనన్న లే అవుట్ల పేరుతో బ్రాహ్మణపల్లి, కోవెలగుట్టపల్లి, బీడుపల్లిలో ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు ఇళ్లు మంజూరు చేసింది. ఈ మూడు లే అవుట్లు జాతీయ రహదారి పక్కనే ఉండటం గమనార్హం. ఆయా లే అవుట్లలో 2,600 ఇళ్లు మంజూరు కాగా ఇందులో కొన్ని పూర్తికాగా మరికొన్ని నిర్మాణదశలో ఉన్నాయి. ముదిగుబ్బ నుంచి కోడూరు వెళ్లే జాతీయరహదారి(342) పుట్టపర్తి సమీపంలో వెళుతోంది.

శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు సంతోషదాయకం



శ్రీసత్యసాయి బాబా పేరుతో జిల్లా రావడం సంతోషదాయకం, ప్రజలకు ఎన్నో సేవలు అందించిన ఆ మహానీయుడి పేరును పేరుతో జిల్లా ఏర్పాటు చేసి ఈప్రాంతానికి గౌరవం తెచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా మహనీయులను గుర్తించి వారి పేరున జిల్లాల నామకరణం చేయడం హర్షణీయం.

– చితంబరరెడ్డి, సత్యసాయి భక్తుడు

వంతెన రావడం అదృష్టం



గతంలో రాయలవారి పల్లికి రహదారి లేదు. వర్షాలు వచ్చి చిత్రావతి నది ప్రవహించినప్పుడు గ్రామస్తులు ఇబ్బంది పడేవారు. ముదిగుబ్బ నుంచి కోడూరుకు వెళ్లే రహదారి పుట్టపర్తి మీదుగా పోయేలా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా మా గ్రామానికి పెద్దత వంతెన నిర్మిస్తున్నారు.

– చంద్రాయుడు, రాయలవారిపల్లి

సమస్యలు తీరాయి



జగనన్న ప్రభుత్వంలో సంచివాలయలతో ఏర్పాటుతో ప్రజలకు పాలనమరింత దగ్గరకు చేర్చారు. పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. ఇంటి వద్దకే డాక్టర్ వచ్చి వైద్యం అందిస్తున్నారు. వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని మళ్లీ ఆదరిస్తే మరిన్ని పథకాలు అమలుచేస్తారనే నమ్మకం ఉంది.

– సుశీలమ్మ బ్రాహ్మణపల్లి

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా

- పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- బుక్కపట్నం రోడ్‌షో గ్రాండ్ సక్సెస్





బుక్కపట్నం రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, రోడ్ షోకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు

పుట్టపర్తి: తనను గెలిపిస్తే పుట్టపర్తిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికలు అయిపోగానే టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి, ఆమె మామ పల్లె రఘునాథరెడ్డి అనంతపురం పారిపోతారన్నారు. తాను లోకల్ అని.. ప్రజల మధ్యే ఉంటానని, గెలిచాక నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో పయనింపజేస్తానని హామీ ఇచ్చారు. మండల కేంద్రం బుక్కపట్నంలో వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ శుక్రవారం రోడ్ షో నిర్వహించారు. వీరికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రిటైర్డు పీఆర్ డీఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలతారెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. రోడ్ షో ఆసాంతం అభ్యర్థులపై పూల వర్షం కురిపించారు. ప్రముఖ సింగర్ నిర్మల రాథోడ్ పాడిన పాటలు ఉర్రూతలూగించాయి. ఈ సందర్భంగా తేరు కూడలిలో అశేషంగా తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి అభ్యర్థులు ప్రసంగించారు.

జగన్ ప్రభంజనం

రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభంజనం సృష్టించబోతున్నారని ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ అన్నారు. సంక్షేమ పాలనకు ప్రజలందరూ జై కొడుతున్నారన్నారు. పారదర్శక– సంక్షేమ పాలన కోసం మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటమి అంచున ఉన్న బాలకృష్ణ టీడీపీ అధికారంలోకి వస్తే సత్యసాయి జిల్లా కేంద్రంగా హిందూపురం చేస్తామని మోసపూరిత హామీలిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపిస్తే పుట్టపర్తి అభివృద్ధిలో తాను భాగస్వామినవుతానన్నారు.

విశ్వసనీయతకే మళ్లీ పట్టం

వైఎస్సార్‌సీపీకి ఎక్కడ మంచిపేరు వస్తుందోనని భయపడిన చంద్రబాబు కుట్రలు చేసి ఎన్నికల కమిషన్ ద్వారా సంక్షేమ పథకాల నగదు బదిలీ నిలుపుదల చేయించారని, అయితే కోర్టు మొటిక్కాయల వేసి తక్షణమే లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మేలును సహించలేని బాబు వద్దు.. సంక్షేమ కాంతులు నింపే జగన్ ముద్దు అని ప్రజలు నినదిస్తున్నారన్నారు. హిందూపురంలో టీడీపీ అభ్యర్థి బాలయ్యకు ఓటమి ఖాయమన్నారు. ఓట్ల కోసం అలవికాని హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబును ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు. హామీలు పక్కాగా అమలు చేసి చూపించిన జగన్ విశ్వసనీయతకే జనం మళ్లీ కట్టబోతున్నారన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో లబ్ధి పొందిన వారంతా 13న జరిగే పోలింగ్‌లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ముదిగుబ్బ నుంచి వయా బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల మీదుగా కోడూరు తోపు వరకు 342 జాతీయ రహదారితో పాటు ముద్దనూరు, కదిరి, ఓడీచెరువు మీదుగా మరో జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి సమీపం నుంచి మేదరమెట్ల వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జోరుగా జరుగుతున్నాయని, ఇవి పూర్తయితే పుట్టపర్తిలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, నాయకులు స్నేహిన్‌రెడ్డి, కొత్తకోట కేశప్ప, మాజీ సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మండల మైనార్టీ విభాగం కన్వీనర్ కదీర్, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, బుక్కపట్నం గ్రామ కమిటీ అధ్యక్షుడు తల్లం మల్లికార్జున, బూత్ కన్వీనర్ నీలూరి ఈశ్వర్, నారాయణస్వామి, మహేశ్, పూలకుంట్ల నాగభూషణ, శీనా, డీలర్లు నాగభూషణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



నిలువురాతిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పెద్దగువ్వలపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ముస్లింలు

అమడగూరు: మండల వ్యాప్తంగా ఉన్న పది పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. అన్ని గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వం ఆవశ్యకతను తెలియజేశారు. ఈ నెల 13 వ తేదీన జరిగే ఎన్నికల్లో సీరియల్ నంబర్ 3 కింద వచ్చే ఫ్యానుగుర్తు పక్కనే ఉన్న బటన్ నొక్కి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ రకాల కమిటీ సభ్యులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

రొద్దం: మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని ముస్లింలు ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు షఫీవుల్లా, మైనార్టీ నాయకులు అమీర్, షానవాజ్, జిలాన్, ఎజాజ్, ఇమామ్, వార్డు మెంబ్, టీకొట్టు బాబు, బాషా, ఫయాజ్, హబీబ్, అక్బర్, ఫిరోజ్, గయార్, అల్లాబకాష్, మస్తాన్, బాబజాన్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డి పల్లిలో నమూనా బ్యాలెట్‌తో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేసులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద ....

ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బాహాటంగానే చెబుతున్న టీడీపీ కూటమికి ఓటుతో బుద్ధి చెప్పాలని మైనార్టీ నాయకులు ముస్లిం ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. శుక్రవారం వివిధ మసీదుల వద్ద వారు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్లు తయూబ్, ఫర్జియాభాను, ఫరీద్, ఇర్షాద్, ఇస్మాయిల్‌సాబ్, ఖాజాపీర్, షేక్షావలి, నేమత్, మున్నీర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పెనుకొండలో ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్ తయూబ్

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ నాయకులు

నల్లమాడ: దొన్నికోట, పాతబత్తలపల్లి గ్రామాలకు చెందిన పలువురు శుక్రవారం టీడీపీని వీడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. దొన్నికోటకు చెందిన నల్లజోడు నారాయణప్ప, పాపన్న, మహేంద్ర, మిద్దిబయప్ప, పాతబత్తలపల్లికి చెందిన నడివీధి క్రిష్టారెడ్డి, నరసింహులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలోని జూలకుంటలో టీడీపీకి చెందిన కురాకుల హరీష్, నాగభూషణం, అనీల్ శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిని సర్పంచ్ సోమశేఖర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి, నాయకులు ప్రభాకర్, నరసింహులు, రవీంద్రారెడ్డి, ఆంజనేయులు, మారుతీ, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయిబాబా సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయంలో శుక్రవారం షిరిడి సాయిబాబా సేవా సమితి నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కాటం వీరనారాయణ, ఉపాధ్యక్షుడిగా నారాయణరెడ్డి, కార్యదర్శిగా రామలింగయ్య, ట్రెజరర్‌గా సూర్యనారాయణ, జాయింట్ కార్యదర్శిగా జీసీ నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోరంట్ల: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా ఆపేస్తున్నామన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

పోలీసుల కవాతు

ఎన్పీకుంట: పి కొత్తపల్లిలో స్థానిక ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కేరళ పోలీసు దళాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి



వెంకటగిరిపాళ్యంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చరణ్‌రెడ్డి

పెనుకొండ రూరల్: అర్హతే ప్రామాణికంగా ఇంటి ముంగిటమే సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంకటగిరిపాళ్యంలో పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు, ఈవీఎం నమూనాతో ఫ్యాను గుర్తుపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను అఖండ మెజారిటీతో గెలిపించాలని విన్నవించారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, సర్పంచ్ లక్ష్మీ, నాయకులు ఆదినారాయణ, చంద్రానాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

రొద్దం: మండల పరిధిలోని ఆర్ కొట్టాల సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డారు. పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై రొద్దం వైపు నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనం, పావగడ నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్పారు. ఈ ప్రమాదంలో మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన రంగ అనే వ్యక్తి గాయపడగా వెంటనే ఆస్పత్రికి తరలించారు.

ఓటమి భయంతోనే టీడీపీ దాడులు

- బీ.ఎస్.మక్బూల్ అహ్మద్



మాట్లాడుతున్న బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: ఓటమి భయంతోనే టీడీపీ నేతలు రాష్ట్రంతో పాటు నియోజవకర్గంలో దాడులకు తెగబడుతున్నారని వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీ.ఎస్.మక్బూల్ అహ్మద్ విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కదిరిలో ఓటమి భయం పట్టుకున్న టీడీపీ గుండాలు తనకల్లు మండలంలో తమ ప్రచార వాహనాన్ని ధ్వంసం చేశారన్నారు. వాహనాన్ని ధ్వంసం చేసినంత మాత్రాన తమ గెలుపును ఆపలేరని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారం చేపట్టబోతుందని అనేక సర్వేలు ఇప్పటికే తేల్చాయన్నారు. ఇది తెలుసుకున్న టీడీపీ దిక్కుతోచని స్థితిలో ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. అధికారం లేకుండానే ఇంత అరాచకం సృష్టిస్తున్న పచ్చ మూక అధికారంలోకి వస్తే ఎలా వ్యవహరిస్తుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. మహిళ అని కుడా చేడకుండా మాచర్ల ఎమ్మెల్యే సతీమణిపై రాళ్ల దాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు. సంక్షేమ పాలనకు రాక్షస పాలనకి తేడా తెలియని లోకేష్ బాబు ఏదేదో మాట్లాడుతున్నారు. పబ్లిసిటీ పిచ్చితో పుష్కరాల్లో 30 మందితో పాటు 19 మంది మహిళ కూలీను చంపిన చంద్రబాబు రాక్షస పాలన 2019లోనే అంతమైందన్నారు. జగనన్న నేతృత్వంలోని తమ ప్రభుత్వం పేదలకు డీబీటీ ద్వారా రూ.2.7 లక్షల కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.

ఘనంగా బసవ జయంతి



గుడిబండ: బసవన్న చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం/గుడిబండ: వీరశైవ లింగాయతుల ఆరాధ్య దేవుడు బసవేశ్వరస్వామి జయంతి వేడుకలను ఆ కులస్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిరువీధి రథంలో స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని కూర్చొబెట్టి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. మరోవైపు గుడిబండలోనూ బసవ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బసవన్న చిత్రపటాన్ని ఘనంగా ఊరేగించారు.